అభివృద్ధి పనులు ముందుకు కదిలేనా?

- జనవరి 30తో ముగియనున్న పాలకవర్గ పదవీకాలం
- ఆందోళనలో పాలకవర్గసభ్యులు



ఎస్సారార్ కళాశాల ఆవరణలో అసంపూర్తిగా ఉన్న ఆడిటోరియం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 3: గత ఏడాది నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో రాజకీయసందడి కనిపించింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. అప్పటి వరకు పూర్తయిన పనులు తప్ప అసంపూర్తిగా మిగిలిన పనులు ముందుకు సాగలేదు. సీఎం హామీ, పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోయాయి. స్మార్ట్‌సిటీ పనులను కూడా నిలిచిపోయాయి. చేసిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండడం, పనుల్లో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు రావడం, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాక పోవడం వంటి కారణాలతో అభివృద్ధి పూర్తిగా స్తంభించింది.

● 130 కోట్ల పనులకు శంకుస్థాపనలు

130 కోట్ల సీఎం హామీ నిధులతో పలు చోట్ల రోడ్లు, డ్రైనేజీలు, వరద మురుగునీటి కాలువలు (స్టామ్‌వాటర్ డ్రైనేజీ) నిర్మాణాలకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేశారు. సగానికిపైగా పనులు అసంపూర్తిగానే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లను తవ్వి వదిలి వేయడంతో ఆయా రోడ్లు నిరుపయోగంగా మారాయి. గుంతల్లో వర్షపు నీరు నిలిచి దోమల ఆవాసాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని విద్యానగర్, అశోక్‌నగర్, కట్టరాంపూర్ తదితర ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● ఐదునెలల్లో పాలకవర్గ పదవీకాలం పూర్తి

ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం 2025 జనవరి 29తో ముగియనున్నది. ఓవైపు అసంపూర్తి పనులు, మరోవైపు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పనులు చేపట్టకపోవడంతో మళ్లీ ప్రజల్లోకి ఎలా వెళ్లాలో తెలియడం లేదని పలువురు కార్పొరేటర్లు ఆందోళన చెందుతున్నారు. ఐదునెలల్లో పనులు పూర్తి చేయడంతోపాటు గతంలో ప్రతిపాదనలు ఇవ్వడంతో టెండర్లు నిర్వహించిన పనులు, కొత్తగా చేపట్టాల్సిన పనులు పూర్తి చేస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అన్ని పార్టీలకు చెందిన కార్పొరేటర్లకు అభివృద్ధి పనులు నిలిచిపోవడం తమ విజయావకాశాలపై ప్రభావం పడుతుందనే భయం వెంటాడుతోంది.

● నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల పనులు

స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతిలో నాలుగు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలను ప్రారంభించగా, పద్మనగర్, వ్యవసాయమార్కెట్, కలెక్టరేట్ ముందు చేపడుతున్న మార్కెట్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలివేశారు. కశ్మీరుగడ్డ రైతుబజారును కూల్చివేసి అదేస్థానంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ పనులు నిలిచిపోవడంతో మార్కెట్ వెలుపల రోడ్లపైనే కూరగాయలు, చేపల క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. నగర నడిబొడ్డున దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన కళాభారతి ఆడిటోరియం శిథిలావస్థకు చేరుకోవడంతో ఒక్కటి కూడా ఆడిటోరియం లేకుండా పోయింది. దీంతో అత్యాధునిక హంగులతో ఎస్సారార్ కళాశాల ఆవరణలో ఆడిటోరియంను నిర్మించేందుకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. ఆ ఆడిటోరియం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. పలు చోట్ల పార్కులు, శిథిలావస్థకు చేరిన రోడ్లు కూడా అభివృద్ధి చేయడంలేదు. నగర నడిబొడ్డున ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాల మైదానంలో ఆధునిక హంగులతో చేపడుతున్న పార్కు పనులు 90 శాతం పూర్తయ్యాయి. సెప్టెంబరు నెలాఖరులోగా ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మేయర్ ప్రకటించారు. అది సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. మున్సిపల్ జనరల్ ఫండ్, పెండింగ్‌లో ఉన్న చిన్న పనులు మినహా అభివృద్ధి పూర్తిగా పడకేసిందని అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు, ప్రజలు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దాదాపు రెండు నెలల క్రితం నగరపాలక సంస్థ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించి, అసంపూర్తి పనులను పూర్తిచేసేందుకు నిధులు విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు. అది ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.

రూ. 938 కే గృహ విద్యుత్ కనెక్షన్

- బీపీఎల్ కుటుంబాలకు కొత్త పథకం



హుజూరాబాద్, సెప్టెంబరు 3: విద్యుత్ మీటర్లు లేని బీపీఎల్ కుటుంబాలకు ఎన్‌పీడీసీఎల్ మంచి అవకాశం కల్పించింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉండే కుటుంబాలకు జీఎస్టీ కలుపుకుని 938 రూపాయలకే గృహ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ట్రాన్స్‌కో అధికారులు గ్రామాల్లో దీని గురించి అవగాహన కల్పిస్తున్నారు. సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీ వరకు విద్యుత్ అధికారులు గ్రామాల్లో దరఖాస్తులు తీసుకొని రసీదు అందిస్తారు. సాధారణ గృహ విద్యుత్ కనెక్షన్ కావాలంటే మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. లోడ్ ఆధారంగా నగదు దరఖాస్తు ఫీజులు చెల్లించాలి. ప్రస్తుతం రూ. 500 వాట్ల లోడ్ ఉపయో గించుకునే వినియోగదారులు సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలి.

● గృహ జ్యోతి పథకం వర్తింపజేయడానికే...

విద్యుత్ మీటర్లు లేకుండానే గ్రామాల్లో చాలా మంది ఎస్సీ, ఎస్టీ, తండాల్లోని కుటుంబాలు విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. వీరికి ఉచిత విద్యుత్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యుత్ మీటర్లు లేని కారణంగా గృహ జ్యోతి పథకం వర్తించడం లేదు.

15 వరకు దరఖాస్తుకు అవకాశం

- వీరాచారి, ట్రాన్స్‌కో రూరల్ ఏఈ, హుజూరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం పేదలకు 938 రూపాయలకే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. రెండు రోజులుగా సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటిస్తూ దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉంది. విద్యుత్ మీటర్ లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గృహజ్యోతి పథకాన్ని పొందాలి.

గూండా సంస్కృతిని ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ సర్కార్

- మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలపై దాడిపై ఆగ్రహం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 3: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గూండా సంస్కృతిని ప్రోత్సహిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఒక ప్రకటనలో విమర్శించారు. భారీ వర్షాలతో కకలావికలమైన ఖమ్మం ప్రజలకు చేయూతనివ్వడానికి మంగళవారం అక్కడికి వెళ్లిన మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం అత్యంత హేయమైన చర్యగా ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం బాధితులను ఆదుకోవడంలో విఫలమైన నేపథ్యంలోనే బీఆర్ఎస్ పార్టీ రంగంలోకి దిగాల్సి వచ్చిందని, వీటిని స్వాగతించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం జీర్ణించుకోలేక దాడికి పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా వ్యతిరేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యవాదులంతా ఈ చర్యను ముక్తకంఠంతో ఖండించాలని గంగుల కమలాకర్ విజ్ఞప్తి చేశారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. విపత్తును ఎదుర్కొనే సామర్థ్యం లేక ప్రజలకు సౌకర్యాలు అందించలేక విషయాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వమే గుండాయిజాన్ని ప్రోత్సహిస్తున్నట్లు అనిపిస్తుందని అన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏనాడు ఇలాంటి దాడులు చూడలేదని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

10 మంది ఎస్ఐల బదిలీ

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 3: పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 10 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్ల(ఎస్ఐ)కు బదిలీలు జరిగాయి. ఈ మేరకు మంగళవారం సీపీ అభిషేక మొహంతి ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్‌లోని ఎల్ఎండీ ఎస్ఐగా పనిచేస్తున్న బి చేరాలును కరీంనగర్ మూడో ఠాణా ఎస్ఐగా, జమ్మికుంటలో పనిచేస్తున్న టి వివేక్‌ను ఎల్ఎండీ ఎస్ఐగా బదిలీ చేశారు. కరీంనగర్ రూరల్ ఎస్ఐ వి శేఖర్‌ను రామడుగు ఎస్ఐగా, రామడుగు ఎస్ఐ ఎం సురేందర్‌ను కరీంనగర్ ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ చేశారు. పోలీస్ కంట్రోల్ రూం(పీసీఆర్)లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ యు భాస్కర్‌రెడ్డిని కరీంనగర్ ఒకటో ఠాణాకు, సైదాపూర్ ఎస్ఐ జె ఆరోగ్యంను జమ్మికుంటకు, కరీంనగర్ వెకెన్సీ రిజర్వు(వీఆర్)లో ఉన్న సీహెచ్ తిరుపతిని సైదాపూర్ ఎస్ఐగా, కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న పి లక్ష్మారెడ్డిని కరీంనగర్ రూరల్ ఎస్ఐగా బదిలీ చేశారు. కరీంనగర్ సీసీఆర్‌బీలో పని చేస్తున్న జి రాజన్నను కరీంనగర్ ఒకటో ఠాణా ఎస్ఐగా, సిద్దిపేట ఎస్‌బీకి అటాచ్‌డ్‌గా ఉన్న జి నరేందర్‌రెడ్డిని గంగాధర ఎస్ఐగా బదిలీ చేశారు. గంగాధర్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎస్ కిరణ్‌రెడ్డి ఇటీవల సీఐగా పదోన్నతి పొందారు. ట్రాఫిక్‌లో పనిచేస్తున్న స్వామి, శ్రీధర్‌లకు సీఐగా పదోన్నతులు వచ్చాయి. పదోన్నతులు పొందిన ముగ్గురు సీఐలకు ఇంకా పోస్టింగ్‌లు ఇవ్వలేదు.

వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 3: నగరపాలక సంస్థకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రావలసిన ఆస్తిపన్నులన్నింటిని డిసెంబరులోగా వంద శాతం వసూలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో అధికారులు, సిబ్బందితో ఆస్తిపన్ను వసూళ్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తిపన్ను వసూళ్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవకతవకలకు పాల్పడినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. పన్నులను సక్రమంగా వసూలు చేసి నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంచాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం ఏడు గంటల నుంచే బిల్‌కలెక్టర్లు డివిజన్లకు వెళ్లి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. కొత్తగా వచ్చిన బిల్‌కలెక్టర్లకు, సిబ్బందికి రెవెన్యూ అధికారులు శిక్షణ ఇవ్వాలని అన్నారు. రోజువారీగా పన్నుల వసూలు వివరాలను అందించాలన్నారు. విలీన గ్రామ డివిజన్ రేకుర్తిలో వారంరోజుల్లో ఇంటింటి అసెస్‌మెంట్ సర్వే పూర్తి చేసి డిమాండ్ రిపోర్టును అందించాలని కమిషనర్ సూచించారు. అసెస్‌మెంట్‌లో ఉన్న ప్రాపర్టీ కంటే తక్కువ కొలతలు చూపిన ఇంటి యజమానులపై 25 శాతం పెనాల్టీ విధించాలని, ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు ఇవ్వొద్దని రెవెన్యూ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయికి వెళ్లి అసెస్‌మెంట్లను పరిశీలిస్తామని, ఎక్కడైనా తప్పు జరిగినట్లు గుర్తిస్తే సంబంధిత బిల్ కలెక్టర్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కమర్షియల్ కాంప్లెక్సుల రీఅసెస్‌మెంట్ చేయాలని, పెండింగ్ బకాయిదారులకు నోటీసులు జారీ చేసి చట్ట ప్రకారంగా వసూలు చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ వాణిజ్య సముదాయాలకు బహిరంగ టెండర్లను నిర్వహించి వాటిని కేటాయించి అద్దెల ద్వారా ఆదాయాన్ని సమకూర్చాలని కమిషనర్ ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, రెవెన్యూ అధికారులు ఆంజనేయులు, గణేశ్, ఆర్ఐలు, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

'స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి'

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 3: పెండింగ్‌లో ఉన్న 7,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ విష్ణు మాట్లాడుతూ ఇటీవల నల్గొండలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో విద్యారంగ స్థితి, రాష్ట్రస్థితిపై చర్చించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పేద, మధ్య తరగతుల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఫీజు రీ యయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రభుత్వం తూట్లు పొడిచే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పించాలని, ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని, డైట్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్, లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. గురుకుల సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు మధు, నగర కార్యదర్శి నందు, జోనల్ ఇంచార్జీలు విష్ణు, విగ్నేష్, యోగేశ్, సాయి పాల్గొన్నారు.

థైరాయిడ్ మాత్రలను అందుబాటులో ఉంచాలి

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 3: ఆరోగ్య కేంద్రాల్లో థైరాయిడ్ మాత్రలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని, రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆరోగ్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. యోగా కేంద్రాన్ని పరిశీలించి ఫార్మసీలో అందజేస్తున్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు వైద్య సిబ్బంది హిమోగ్లోబిన్ పరీక్ష చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రి ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్

28 మందికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 3: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 5న జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు అందజేస్తారు. ఈయేడు 28 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా విద్యాశాఖ ఎంపిక చేసింది. వీరికి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నది.

● జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు

చీటి లక్ష్మణ్‌రావు (జిహెచ్ఎం-2) జడ్పీహెచ్ఎస్ నేదునూర్, కె శ్రీనివాస్ (ఎస్ఏ) జడ్పీహెచ్ఎస్ ఒద్యారం, ఫర్‌హత్ షహీన్ (ఎస్ఏ) జడ్పీహెచ్ఎస్ వెదిర, అడ్లపల్లి అనసూయ (ఎస్ఏ) జడ్పీహెచ్ఎస్ నగునూర్, కె సత్యనారాయణ (ఎస్ఏ) జడ్పీహెచ్ఎస్ ఎల్బాక, ఆర్ గంగారాం (ఎస్ఏ) జడ్పీహెచ్ఎస్, కొండపల్కల, గోలి అరుణాదేవి (ఎస్ఏ) జడ్పీహెచ్ఎస్ నవాబుపేట, ఓరుగంటి తిరుపతి (ఎస్ఏ) జడ్పీహెచ్ఎస్ కందుగుల, ఎం మురళీకృష్ణ (పీజీటీ) టీజీఎంఎస్ రామడుగు, ఎ దేవేందర్ (పీజీటీ) టీజీఎంఎస్ రుక్మాపూర్, ఎస్ సత్యనారాయణరావు (టీజీటీ) టీజీఎంఎస్ ముల్కనూర్, తంగళ్లపల్లి మధూకర్ రావు (టీజీటీ) టీజీఎంఎస్ ముల్కనూర్, గీట్ల మహేందర్‌రెడ్డి (ఎస్ఏ) ఎంపీయూపీఎస్ చిట్యాలపల్లి, మాలోతు స్వరూప (ఎస్ఏ) ఎంపీయూపీఎస్ కొండాపూర్, పి కాంతయ్య (ఎస్జీటీ) ఎంపీయూపీఎస్ నర్సింహులపల్లి, జి సాంబమూర్తి (ఎస్జీటీ) ఎంపీయూపీఎస్ పోతిరెడ్డిపల్లి, నరహరి సత్యనారాయణరెడ్డి (ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం) జీపీఎస్ శ్రీనగర్‌కాలనీ

● హుజూరాబాద్ డివిజన్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు

కె చంద్రమౌళి (ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం) ఎంపీపీఎస్ వెల్ది, వి సునీత (ఎస్జీటీ) ఎంపీపీఎస్ మన్నెంపల్లి, ఎం సరిత (ఎస్జీటీ) ఎంపీపీఎస్ వెలిచాల, కె రూపాలేఖ (ఎస్జీటీ) ఎంపీపీఎస్ వీణవంక, పి సోలమన్‌రెడ్డి (ఎస్జీటీ) ఎంపిపిఎస్ శాంతినగర్, జైబున్నీషా (ఎస్జీటీ), పిఎస్ ఎస్సీకాలనీ కమాన్‌పూర్, బి ప్రభాకర్, (ఎస్జీటీ) ఎంపిపిఎస్ గణేశ్‌నగర్, గొల్లూరి ప్రమోద్‌కుమార్ (ఎస్జీటీ) ఎంపీపీఎస్ బీసీ కాలనీ ఆకునూర్, గుడిమిల్ల బలరాం (ఎస్జీటీ), ఎంపీపీఎస్ కోరపల్లి, సంది అనిత (ఎస్జీటీ) ఎంపీపీఎస్ తాడికల్, మ్యాక రాములు (వీటీఐ) జడ్పీహెచ్ఎస్ (బాలికలు)

విజృంభిస్తున్న విష జ్వరాలు



హుజూరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో జ్వరబాధితులు



హుజూరాబాద్, సెప్టెంబరు 3: ఇటీవల కురుస్తున్న వర్షాలకు జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది నామమాత్రంగా పని చేస్తుండడంతో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. ఏ ఆస్పత్రిలో చూసిన జ్వరపీడితులే కనబడుతున్నారు. 10 రోజులుగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరాల బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ వైద్యులు వివిధ రకాల పరీక్షల పేరిట దోపిడి చేస్తున్నారు.

● గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం

పట్టణాల్లో, గ్రామాల్లో పారిశుధ్య అమలు సక్రమంగా కాకపోవడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. గతంలో సర్పంచ్‌లు ఉంటే పారిశుధ్య పనులను చూసుకునే వారు. ఎనిమిది నెలల క్రితమే సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. వీరు నామమంత్రంగా గ్రామాల్లోకి రావడంతో పారిశుధ్యం లోపించి దోమలు అధికమై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. చిన్న పిల్లలు కూడా జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వరాలతో ప్రభుత్వాస్పత్రికి వెళితే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీనిని అదునుగా తీసుకున్న వైద్యులు ఇష్టానుసారంగా దోపిడి చేస్తున్నారు. ఏఎన్ఎంలు గ్రామాలకు అడపాదడపా వస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్ల చుట్టూ నీళ్లు చేరి దోమలు పెరిగిపోయాయి. చాలా గ్రామాల్లో చెరువు, కుంటలలోనే మంచినీటి బావులు ఉన్నాయి. వర్షాలకు వాటిలోని నీరు కలుషితమైంది. కలెక్టర్, జిల్లా వైద్యాధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం అమలుతో పాటు జ్వరపీడితులకు పరీక్షలు నిర్వహించి, మందులను అందజేయాలని పలువురు కోరుతున్నారు.



పేకాటరాయుళ్ల పట్టివేత

కథలాపూర్, సెప్టెంబరు 3: మండలంలోని సిరికొండ శివారులో మంగళవారం సాయంత్రం పోలీసులు పేకాట శిబిరంపై దాడులు చేసి 11 మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. గ్రామ శివారులో పేకాడుతున్నట్లు స మాచారం రావడంతో దాడులు నిర్వహించి వారి నుంచి రూ.74,220లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ తెలిపారు.







బావిలో పడిన ఎలుగుబంటి

● నిచ్చెన ఏర్పాటు చేయడంతో బయటికి వచ్చినట్లు గుర్తించిన అధికారులు



అటవీశాఖ అధికారులు బావిలో ఏర్పాటు చేసిన నిచ్చెన

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి శివారులోని పాడుబడిన వ్యవసాయ బావిలో ఎలుగుబంటి పడిందనే సమాచారంతో వెంకటాపూర్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మోహన్‌లాల్ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. గ్రామ శివారులోని బావిలో నుంచి ఎలుగుబంటి అరుపులు రావడంతో గమనించిన చుట్టు పక్కల రైతులు సోమవారం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న డీఆర్వో మోహన్‌లాల్, ఎఫ్‌బీవో అనూష పరిశీలించారు. ఎలుగుబంటిని కాపాడేందుకు స్థానికుల సహాయంతో చర్యలు చేపట్టారు. సుమారు 15 మీటర్ల లోతు ఉన్న పాడు బడిన వ్యవసాయ బావిలో నిచ్చెనలను ఏర్పాటు చేశారు. చీకటి పడడంతో వెనుదిరిగారు. మంగళవారం చేరుకొని పరిశీలించారు. బావిలో నుంచి శబ్దం వినిపించ లేదని, నిచ్చెనకు ఎలుగుబంటి వెంట్రుకలు కనిపించాయని, బావిలోంచి ఎలుగుబంటి నిచ్చెన ద్వారా బయటకు వెళ్లిన ఆనవాళ్లను గుర్తించామని డీఆర్వో మోహన్‌లాల్ పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 3 : జగిత్యాల మండలం పెర్కపల్లి లోలెవల్ వంతెన వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన తునికి జగన్(46) అనే వ్యక్తి మృతి చెందాడు. రేచపల్లి గ్రామానికి చెందిన జగన్ రాత్రి తన పని నిమిత్తం హన్మాజీపేట వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి జగిత్యాలకు వస్తున్న క్రమంలో హన్మాజీపేట లోలెవల్ వంతెన వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

దంపతులకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ శివారులో మంగళవారం కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పి భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి చెందిన తిరుపతి తన భార్యతో కలిసి బైక్‌పై ఎల్లారెడ్డిపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. =కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, రాంరెడ్డి గమనించి మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని ట్రాలీ ఆటో బోల్తా

● ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని ట్రాలీ ఆటో మంగళవారం బోల్తా పడింది. ఈ సంఘటనలో సిరిసిల్ల పట్టణానికి చెందిన మధుకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపునకు వెళుతున్న ట్రాలీ ఆటో మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో డివైడర్‌ను అతి వేగంగా ఢీకొట్టి ప్రధాన రహదారిపై తలకిందులైంది. ఆ సమయంలో రోడ్డు వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. కాగా ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.







ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	2,20,473	1,95,853	80.5	70.425
ఎల్లంపల్లి	4,72,354	4,72,064	20.175	14.248
మిడ్ మానేరు	17,680	6,400	27.54	21.52
ఎల్ఎండీ	2,708	277	24.034	16.26
ఎగువమానేరు	27,500	------	2.00	2.00

ఇద్దరు బ్యాటరీల దొంగల అరెస్టు

పెగడపల్లి, సెప్టెంబరు 3: పెగడపల్లి మండలంలో ఇద్దరు బ్యాటరీల దొంగలను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. నెల రోజులుగా మండలంలోని నందగిరి, అయిత్‌పల్లి గ్రామాలలో బయట నిలిపిన డీసీఎం వ్యానుల నుంచి బ్యాటరీలు దొంగిలిస్తున్నారనే పిర్యాదులు న్నాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపి బ్యాటరీలు దొంగిలించిన మాదవేని ప్రశాంత్, ఉబిది అంజయ్య లంబాడిపల్లిలను అరెస్టు చేసి, అయిత్‌పల్లి శివారులో దాచి ఉంచిన బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

రెండు షాపుల్లో దొంగతనం

రామడుగు, సెప్టెంబర్ 3: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో పక్కపక్కనే ఉన్న రెండు దుకాణాల్లో మంగళవారం చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర మెకానిక్ సెంటర్, వెంకటేశ్వర ఇంజనీరింగ్ వర్క్ షాప్ యాజమానులు రోజులాగే సోమవారం రాత్రి షాపు తాళం వేసి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి అశోక్ అనే వ్యక్తి షాపు కౌంటర్‌లో నుంచి రూ.15 వేల నగదు, శంకరయ్య అనే వ్యక్తి షాపులో నుంచి రూ.2 వేల నగదు చోరీ అయింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

విద్యార్థులూ పాఠశాలకు రండి

పెద్దాపూర్ గురుకులం... నెల రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారి తీసిన పాఠశాల. విద్యార్థుల వరుస మరణాలు, కొందరు విద్యార్థుల అస్వస్థత అటు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాల యాజమాన్యాన్ని, అధికారులను ఆందోళనకు గురిచేసింది.పాఠశాల చుట్టూ అపరిశుభ్రత, విద్యార్థులకు కనీస వసతుల లేమి, పాత భవనాల్లోనే పాఠాల కొనసాగింపు ఇలా రకరకాల సమస్యలు ఒక్కసారిగా తెరపైకి వచ్చాయి. 15 రోజుల్లో ఇద్దరు విద్యార్థుల మృతి, మరో నలుగురు విద్యార్థులు అస్వస్థతతో ఆస్పత్రిలో చేరడంతో తల్లిదండ్రులు భయాందోళనలకు గురయ్యారు.
తమ పిల్లలకు ఏం జరుగుతుందో అని ఒక్కొక్కరుగా వారి వారి పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పాఠశాలలో వరుస మరణాలతో ప్రభుత్వం తక్షణ చర్యలకు పూనుకుంది.
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాఠశాలను తనిఖీ చేసి అధికారులకు మౌలిక వసతుల కల్పనకు ఆదేశాలు జారీ చేశారు. ఆ సంఘటన తరువాత నెల రోజుల పాటు మూతపడ్డ పాఠశాల అన్ని రకాల వసతులు కల్పించి మళ్లీ పునఃప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి ఒక్కొక్కరినీ పిలుస్తున్నారు.

● నేటి నుంచి పెద్దాపూర్ గురుకులం పునః ప్రారంభం ● వసతులు కల్పించిన అధికారులు ● ఫోన్లు చేసి పిలుస్తున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 3: ఇన్ని రోజులూ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడిన మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో సౌకర్యాలు కల్పించడంతో బుధవారం నుంచి పునఃప్రారంభం కానుంది. ఇటీవల పాఠశాలలో పలు ఘటనలు జరుగడంతో అధికారులు విద్యార్థులకు సెలవులు ప్రకటించారు. గురుకులం పాఠశాల, కళాశాలలో మొత్తం 540 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలోని విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. గురుకుల పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పాఠశాలకు రావడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల పాఠశాలలో వరుస విద్యార్థుల మరణాలతో బెంబేలెత్తిన అధికారులు పాఠశాలలో వసతులు కల్పించారు. వరుస ఘటనలతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాఠశాలను సందర్శించారు. గురుకులంలోని గదులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని నిధులు మంజూరు చేశారు. దీంతో పాఠశాలకు సుమారు ఇరవై రోజుల పాటు సెలవులు ప్రకటించారు.

ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు

గురుకుల పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, పనులు చేపట్టాలని ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు వసతులు కల్పించారు. గతంలో పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్లు, చిన్నపాటి బావులు, పిచ్చి మొక్కలు తొలగించారు. పారిశుద్య పనులు చేపట్టారు. చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు శానిటేషన్ చేశారు. నూతన భవనంలో కరెంట్, ప్లంబింగ్, కిటికీలు, కావాల్సిన మరమ్మతులను చేయించారు. విద్యార్థులు పడుకోవడానికి బెడ్‌లు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసుతులు కల్పించారు.

పాఠశాలకు రావాలని ఉపాధ్యాయుల ఫోన్లు

గురుకులంలో చదువుకునే విద్యార్థులు తిరిగి పాఠశాలకు రావాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు రెండు రోజుల నుంచి ఫోన్లు చేస్తున్నారు. గురుకులంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశామని, విద్యార్థుల భవిష్యత్ కోసం తమ పిల్లలను గురుకులం తిరిగి పంపించాలని తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఫోన్ల ద్వారా సమాచారం అందిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులు నష్టపోతున్నారని, వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు పంపించాలని కోరుతున్నారు.



పెద్దాపూర్ గురుకుల పాఠశాల

అధికారుల సూచనల మేరకు ప్రారంభం
- మాధవీలత, ప్రిన్సిపాల్

చదువులో విద్యార్థులు నష్టపోకుండా ఉన్నత అధికారుల సూచనల మేరకు పదవ తరగతి, ఇంటర్ మీడియట్ కళాశాల విద్యార్థులకు కోసం తరగతులు ప్రారంభిస్తున్నాం. మరో వారంలోగా పూర్తి స్థాయిలో అన్ని తరగుతులు ప్రారంభిస్తాం. పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన వసతులను ఏర్పాటు చేశాం. విద్యార్థులను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరుతున్నాం.

ఘనంగా వ్యవసాయ యూనివర్సిటీ ఫౌండేషన్‌డే

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 3: ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆవిర్భావం జరిగి పదేళ్లు గడుస్తున్న సందర్భంగా జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పొలాసలో యూనివర్సిటీ ఫౌండేషన్‌డే దశాబ్ది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ శ్రీలత హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొలాస పరిశోధన స్థానం నుంచి విడుదల అయిన వరి, నువ్వుల వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానం అత్యంత ప్రాచుర్యం పొందాయన్నారు. అదే విధంగా విద్యార్థులు బాగా చదివి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. ఈ యేడాది అగ్రికల్చర్ పాలిటెక్నిక్ జగిత్యాలకు ఉత్తమ అవార్డు రావడం సంతోషకరం అన్నారు. అలాగే పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డా.బలరాం నాయక్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బెస్ట్ టీచర్, సైంటిస్టు అవార్డు, నాన్‌టీచింగ్ స్టాఫ్‌లో పోసవ్వకు ఉత్తమ ఆఫీస్ సబార్డినేట్‌గా అవార్డులు రావడం అభినందనీయం అన్నారు. అన్ని రకాల అధికారులు, సిబ్బంది, కార్మికులు సమన్వయంతో పనిచేసి యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో దేవయ్య, అసిస్టెంట్ కంప్ట్రోలర్ పురుషోత్తం, వివిధ హోదాల అధికారులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది, కార్మికులతో పాటు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం 10వ వార్షికోత్సవాన్ని రాజేంద్రనగర్ యూనివర్శిటీ నుంచి యూట్యూబ్ ద్వారా లైవ్‌లో వీక్షించారు.



సంబరాల్లో పాల్గొన్న పొలాస పరిశోధన స్థానం అధికారులు, శాస్త్రవేత్తలు

గల్లంతైన మత్స్యకార్మికుడు మృతి

- వాగు సమీపంలో మృతదేహం లభ్యం

గంభీరావుపేట, సెప్టెంబరు 3: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం మానేరు సమీపాన లచ్చపేట వాగువద్ద గల్లంతైన మత్స్యకార్మికుడు మృతి చెందాడు. వాగు ప్రవాహం తగ్గడంతో మంగళవారం అతడి మృతదేహం లభ్యమైంది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేటకు చెందిన శివరాములు అనే మత్స్యకార్మికుడు ఆదివారం ఉదయం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం మానేరు సమీపాన లచ్చపేట వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ వెళ్లారు. వాగు ఒడ్డున శివరాములు దుస్తులు, చెప్పులు కనిపించడంతో గల్లంతయినట్టు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులుగా వాగు పరివాహక ప్రాంతాల్లో గాలించినా శివరాములు ఆచూకీ లభించలేదు. మంగళవారం వరద ప్రవాహం తగ్గడంతో లచ్చపేట శివారులో వాగు ప్రాంతంలో శివరాములు మృతదేహం లభించింది.

దుబాయ్‌లో క్షమాభిక్ష ప్రక్రియ షురూ

- అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు ఊరట

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 3: దుబాయ్‌లో మళ్లీ క్షమాభిక్ష ప్రక్రియ మొదలైంది. దుబాయ్ ప్రభుత్వం ఐదేళ్ల తరువాత అమ్నెస్టీ ప్రకటించడంతో అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు ఊరట లభించింది. దీంతో ఐదేళ్లుగా దుబాయ్‌లో వీసా గడువు ముగిసి అక్కడే ఉంటున్న కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ క్షమాభిక్ష సెప్టెంబరు 1న ప్రారంభమైనా అక్టోబరు 31తో ముగియనుంది. దుబాయ్‌లో చట్ట విరుద్ధంగా తెలంగాణప్రాంతానికి చెందిన దాదాపు 40 వేల మంది వలస కార్మికులు ఉంటారని అంచనా. దుబాయ్ ప్రభుత్వం అమ్నెస్టీ ప్రకటించడంతో వలస కార్మికులు తిరిగి స్వగ్రామాలకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వేలాది మంది విజిట్ వీసాపై వెళ్లి అక్కడే ఉంటూ వివిధ ఉపాధి పనులు చేసుకుంటున్నా వలస కార్మికులు తిరిగి వచ్చేందుకు ఇండియన్ ఎంబసీ వద్ద క్యూ కడుతున్నట్లు తెలిసింది. దుబాయ్‌లో వీసా గడువు ముగిసి అక్రమంగా ఉంటున్న వలస కార్మికులు టికెట్, అవుట్ పాస్‌పోర్టు కోసం సొంతంగా ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ఈ ఖర్చులతో కలిపి దరఖాస్తు చేసుకుంటే దుబాయ్ నుంచి తిరిగి వచ్చేందుకు అవుట్ పాస్ అనుమతి లభిస్తుంది. దుబాయ్‌లోని వివిధ క్యాంపులలో అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు క్షమాభిక్ష ద్వారా తిరిగి వచ్చేందుకు సదవకాశం లభించింది.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 3: కరీంనగర్‌లోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన మసీదు మహేష్(40) సోమవారం అర్ధరాత్రి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మహేష్ 15 రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఏ పనిచేయలేక పోతున్నాడని, మనస్థాపంతోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి సోదరుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జ్వరంతో యువకుడి మృతి



రాజ్ కుమార్(ఫైల్)

సారంగాపూర్, సెప్టెంబరు3: మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన చెంది రాజ్ కుమార్(30) అనే యువకుడు జ్వరంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పెంబట్ల గ్రామానికి చెందిన రాజ్ కుమార్ పెంబట్ల, కోనాపూర్ సహకార సంఘం కార్యాలయంలో సీఈవోగా విధులు నిర్వహిస్తున్నాడు. 15 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నా తగ్గక పోవడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ రాజ్‌కుమార్ మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, భార్య ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శించారు.

వరద నీటిపై ప్రజలను అప్రమత్తం చేయాలి

● శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వస్తున్న వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మంత్రి రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌తో కలిసి సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటిని, గోదావరిలోకి వదిలిపెడుతున్న నీటిని ఆయన పరిశీలించారు. వరద పరిస్థితిని ఆయన నీటి పారుదల శాఖాధికారులతో తెలుసుకున్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా కలెక్టర్లు కోయ శ్రీహర్ష, కుమార్ దీపక్‌కు పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితులను అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గత ఏడాది ఒకేసారి 8 లక్షల క్యూసెక్కుల వరద నీరు రావడంతో జిల్లాలోని గోదావరిఖని, మంథని పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయని, అలాంటి పరిస్థితులు పునరావృతంగా కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంచిర్యాల, చెన్నూర్ ప్రాంతంలోని గోదావరి తీర ప్రాంత ప్రజలను కూడా అప్రమత్తం చేయాలన్నారు. విపత్తులు సంభవిస్తే సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని రామగుండం సీపీ శ్రీనివాస్‌కు సూచించారు.



వరద పరిస్థితిపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

12లోగా ఎంఫార్మసీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 3: ఎస్‌యూ పరిధిలోని ఎం.ఫార్మసీ రెండో, నాలుగో సెమిస్టర్ విద్యార్థులు, బి.ఫార్మసీ 2, 4, 6వ సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) విద్యార్థులు ఈనెల 12లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 18వ తేదీ వరకు చెల్లించడానికి గడువు ఉందని తెలిపారు. పరీక్షలను సెప్టెంబరు లేదా అక్టోబరు నెలలో నిర్వహించనున్నారు.

ప్రాజెక్టులకు కొనసాగుతున్న ప్రవాహం

జగిత్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద పోటెత్తుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,20,473 క్యూసెక్కుల నీరు వస్తుంటే...41 గేట్లు పైకి ఎత్తి దిగువకు 2,20,473 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మరో 17 వేల క్యూసెక్కులు వరద కాలువకు, 4 వేల క్యూసెక్కులు కాక తీయ కాలువకు, 4 వేల క్యూసెక్కులు ఎస్కేప్ గేట్ల ద్వారా విద్యుత్తు తయారీకి విడు దల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 70.140 టీఎంసీల నీరు ఉంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద..

పెద్దపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి పెద్దఎత్తున వరద నీరు వస్తున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటితో పాటు క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వరద నీరంతా ప్రాజెక్టులోకి వస్తున్నది. మంగళవారం సాయంత్రం వరకు 4,72,354 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి 2,59,928 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 2,12,426 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. దిగువకు 4,72,064 క్యూసెక్కుల నీటిని 32 గేట్ల ద్వారా గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.248 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరుకు ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో ఇక్కడి నుంచి ఎత్తిపోతలను సోమవారం ఉదయం నుంచే నిలిపి వేశారు.

మిడ్ మానేరుకు వరద

బోయినపల్లి : శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూల వాగు ఎస్సారెస్పీ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 17,680 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇందులో మానేరు, మూలవాగు ద్వారా 4080, ఎస్సారెస్పీ నుంచి 13,100 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరు తోంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటి ని తరలి స్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 315.27 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27. 54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 21.52. టీఎంసీల మేరకు ఉంది. నేటి నుండి ఉదయం నుండి ఎల్‌ఎండి ప్రాజెక్టుకు 10 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.



కోటిలింగాల వద్ద గోదావరిని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ఎల్‌ఎండీలోకి తగ్గుతున్న వరద

తిమ్మాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోనికి మోయతుమ్మెద వాగు నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరింది. అయితే మంగళవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఎగువ నుంచి మోయతుమ్మెద వాగు నుంచి వస్తున్న వరద తగ్గింది. జలాశయంలోనికి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గింది. ఎల్ ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టిఎంసిలు కాగా ప్రస్తుతం 16.263 టిఎంసిలకు చేరుకుంది. మోయతుమ్మెద వాగు నుంచి 5,805 క్యూసెక్కులు, ఎగువ ఎల్‌ఎండి నుంచి 769క్యూసెక్కులు మొత్తం 6,574 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి రాగా రాత్రి వరకు 2,708కి పడిపోయింది. అవుట్ ఫ్లో 277 క్యూసెక్కులు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి

ధర్మపురి : ధర్మపురి వద్ద గోదావరి వరద మంగళవారం సాయంత్రం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ధర్మపురి చుట్టు పక్కల గ్రామాలకు చెందిన నదీ తీరాన గల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గోదావరి నీటి మట్టం క్షణక్షణం పెరిగి వేగంగా ప్రవాహం కొనసాగింది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది అప్రమత్తం చేశారు. అలాగే నదీ తీరాన గల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు తహసీల్దార్ కృష్ణ చైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి పరిశీలిస్తున్నారు.



ఎల్‌ఎండీ జలాశయం

కోటిలింగాల వద్ద కొనసాగుతున్న వరద

వెల్గటూర్: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎస్పీ అశోక్ కుమార్ కోటిలింగాల వద్ద గోదావరి వరద తీవ్రతను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయా లని అధికారులను ఆదేశించారు. కోటిలింగాల, చెగ్యాం వద్ద గోదావరి పరి వాహక ప్రాంతాలలో పర్యటించి, ప్రజలు, మత్స్యకారులు పశువుల కాపర్లు గోదావరిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమా సాగర్ పాల్గొన్నారు.

13న కొండగట్టు తలనీలాల టెండర్లు

● మూడవ సారి నిర్వహణకు ఏర్పాట్లు
● హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో టెండర్లు



కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, సెప్టెంబరు 3: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో భక్తులు సమర్పించే తలనీలాల పోగు చేసుకునేందుకు గాను దేవస్థానం అధికారులు మరో సారి టెండర్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే రెండు సార్లు టెండర్లు నిర్వహించగా తగిన వేలం రాకపోవడంతో వాయిదా వేసిన అధికారులు మూడవ సారి ఈ నెల 13న నిర్వహించనున్నారు. ఈ ఆగస్టు నుంచి వచ్చే ఏడాది జూలై నెలాఖరు కాలపరిమితికి గాను హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం జరుగనుంది. మొదటి సారి టెండర్ ఫిబ్రవరి 7న నిర్వహించిన వేలంలో రూ.కోటి 62లక్షల 1116 హెచ్చు పాట రాగా ఈ సారి అక్కడి నుంచే వేలం ప్రారంభించనున్నట్లు ఈవో రామకృష్ణరావు తెలిపారు. మరిన్ని వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించవచ్చునని అన్నారు.

ఘనంగా గోపాల కాల్వలు

ధర్మపురి, సెప్టెంబరు 3: శ్రావణ మాసం ముగింపు సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో గోపాల కాల్వలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే విధంగా ఉదయం స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి, రామ లింగేశ్వర స్వామి వారలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఉగ్ర నారసింహుని ఆలయంలో రాజ రాజేశ్వరి భజనా మండలి సభ్యులు, ఆర్యవైశ్యులు, భక్తులు భజనా కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, వేద మంత్రాల మధ్య అందంగా పూలతో అలంకరణ చేసిన స్వామి వారలకు అభిషేకం, విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆర్యవైశ్యులు, భక్తులు గోదావరి నది వరకు ఊరేగింపు జరిపారు.

జమ్మికుంటలో గంజాయి పట్టివేత

● ఐదుగురు యువకులపై కేసు

జమ్మికుంట రూరల్ ,సెప్టంబర్ 3: పట్టణంలోని గణేష్‌నగర్‌లో అనుమానస్పదంగా తిరుగతున్న యువకుల వద్ద నుంచి 700 గ్రాముల గంజాయిని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గణేష్‌నగర్‌లో నలుగురు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా యువకులను గమనించారు. అనుమానాస్పదంగా ఉండటంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బావండ్ల పల్లి అఖీల్,వస్తం కూమార్, చాందల్య కిషోర్, వి విష్ణువర్ధన్‌తో పాటు గంజాయి విక్రయించిన బిజిగిరి షరీఫ్‌కు చెందిన ఎండి అక్రమ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు. గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● పెళ్లైన 15 రోజులకే మృత్యు ఒడికి
● విషాదంలో కుటుంబం

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 3: పెళ్లైన 15 రోజులకే ఓ యువకుడు మృతిచెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. భర్తతో కలిసి నూరేళ్ల జీవితాన్ని ఎంతో సంతోషంగా గడపాలనుకున్న ఆ ఇల్లాలి కలలు కల్లలయ్యాయి. మండలంలోని గుమ్లాపూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేడిపల్లి మండలం వల్లంపల్లి గ్రామానికి చెందిన నవీన్ (26) మృత్యువాత పడ్డాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నవీన్ ఉపాధి నిమిత్తం సింగపూర్ వెళ్లి గత నెలలో తిరిగి వచ్చాడు. నవీన్‌కు గత నెల 18 చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. కటకం నవీన్, ఎలిశెట్టి భూమేశ్వర్, పార్థసారధి ముగ్గురు స్నేహితులు ద్విచక్ర వాహనంపై మాచాపూర్ మీదిగా కోరుట్ల పట్టణానికి వస్తున్నారు. గుమ్లాపూర్ గ్రామ శివారులో వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని గుమ్లాపూర్ గ్రామం వైపు వెలుతున్న ఆటో ఢీకొట్టింది. ఈ సంఘటనలో నవీన్ భూమేశ్వర్ తీవ్ర గాయాల పాలయ్యారు. పార్థసారధికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికు లు వెంటనే 108 ద్వారా క్షతగాత్రులను కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నవీన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భూమేశ్వర్‌కు ప్రథమ చికిత్సను అందించి మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని రాత్రి 8 గంటల వరకు కూడా పోలీసులు పరిశీలించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



నవీన్ (ఫైల్)

జమ్మికుంటలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ నిలపాలి

- రైల్వే మంత్రికి బండి సంజయ్ లేఖ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జమ్మికుంట, సెప్టెంబర్ 3: జమ్మికుంట రైల్వేస్టేషన్లో గత 30సంవత్సరాలుగా ఆగుతున్న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఎత్తి వేసిన విషయంపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్ర రైల్వే శాఖ మంత్రికి లేఖ రాశారు. గత నెల 6వ తేదీన 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కేంద్ర హోం సహాయక మంత్రి బండి సంజయ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని ప్రస్తావించారు. జమ్మికుంట వ్యాపార కేంద్రమని, ఎంతో మంది వ్యాపారులు, ఉద్యోగులు, ప్రజలు దక్షిణ్‌లో రాకపోకలు సాగిస్తారన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 3: కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి పంటలను పరిశీలించారు. గ్రామంలో పత్తి, వరి పొలాలను ఆమె సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాల కారణంగా పంట నిర్వహణ పద్ధతులను రైతులకు వివరించారు. పంట పొలాల్లో నీరు అధికంగా చేరి కలుపు తెగుళ్లు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ అధికారులు సూచనలు పాటిస్తు పంట పొలాలకు మందులను వాడాలని తెలిపారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత వ్యవసాయ శాఖ కార్యాలయంలో గాని మండల విస్తరణ అధికారులకు గాని తెలిపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏ రణధీర్, మండల వ్యవసాయాధికారి బి.సత్యం, మండల విస్తరణ అధికారి పైడితల్లి పాల్గొన్నారు.

ఆవులు, గేదెలు రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలి

-మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 3: నగరపాలక సంస్థ పరిధిలో అనేక చోట్ల వీధులు, రోడ్లలో ఆవులు, గేదెలు సంచరిస్తూ ప్రజలు, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, వాటిని రోడ్లపై తిరుగకుండా పశువుల యజమానులు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. లేనిపక్షంలో రోడ్లలో పశువులు సంచరిస్తే వాటిని గోశాలకు తరలించే చర్యలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. వీధులు, రోడ్లపై పశువులు కనిపిస్తే వాటిని పట్టుకొని గోశాలలకు పంపించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



బ్రహ్మకుమారీలకు మెమెంటో అందిస్తున్న వివేకానంద ప్రిన్సిపాల్ శ్రీనివాస్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 3: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బ్రహ్మకుమారిస్ కరీంనగర్ ఇన్‌చార్జి మనిషా అన్నారు. నగరంలోని వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రజాపిత బ్రహ్మకుమారిస్ వారి ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్‌శ్రీనివాస్ తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన మనిషా మాట్లాడుతూ గంజాయి, ధూమపానం వంటి వ్యసనాలకు యువత బానిసైతే జీవితమే అంధకారం అవుతుందని తెలిపారు. నవ సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ యువతే భారతదేశానికి మార్గదర్శకమన్నారు. సమాజ సేవలో వారు ముందుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బైరి మహేష్, ఎసిఓ బి సంపత్ కుమార్,ఎఓ శ్రావణ్ కుమార్, రామేశ్వరరావు, బ్రహ్మకుమారీస్ శ్రేష్ఠ, పుష్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు కలుపు నివారణపై దృష్టి సారించాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 3: రైతులు వివిధ రకాల పంటలలో కలుపు నివారణ పై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.మంజులత సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం పదవ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జి.మంజులత మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. సిరిసిల్ల రావెప్ విద్యార్థులు పరిశోధన స్థానం సిబ్బంది, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలు, కొండాపూర్, బద్దిపల్లి, చింత కుంట, పొత్తూరు, దత్తత గ్రామమైన నాగుల మల్యాల నుంచి రైతులు హాజరై శాస్త్రవేత్తల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ విజయభాస్కర్, డాక్టర్ పి.మధూకర్‌రావు, డాక్టర్ జి.ఉషారాణి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త కె.మదన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ ఎం.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు పెరటికోడి పిల్లల పంపిణీ

సైదాపూర్, సెప్టెంబరు 3: మండలంలోని సెర్ప్ కార్యాలయం ఆవరణలో మంగళవారం డీపీఎం వంగ రవీందర్, ఏపీఎం చెన్నబోయిన కుమారస్వామిల ఆధ్వర్యంలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా (బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ)పెరటి కోళ్లను పంపిణీ చేశారు. స్వశక్తి సంఘాల్లోని మహిళలకు 20 నుంచి 100 వరకు వారి అవసరాన్ని బట్టి రూ. 110లకు ఒక కోడిపిల్ల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సీసీలు దేవేందర్, రమేష్, రాజేశ్వరి, పర్శరాములు, శ్రీనివాస్, రంజిత్, జమున సీఓ కిషోర్, ఎంఎస్ఏ గీతారాణి, వీవోఏలు సరిత,వాణిశ్రీ, శారద, రజిత, వనజ, రేణుక, అటెండర్ వెంకటేష్, మహిళలు తదితరులు పాల్గొరు.

కస్తూర్బా బాలికల వసతి గృహం తనిఖీ

శంకరపట్నం, సెప్టెంబరు 3: శంకరపట్నం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల వసతి గృహంలో మంగళవారం తహసీల్దార్ భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వంట గదితో పాటు హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల రిజిస్టర్లు తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలను ఎస్వో మాధవిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఇల్లందకుంట, సెప్టెంబరు 3: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ తులసీదాస్ అన్నారు. మంగళవారం మండలంలోని వాగొడ్డు రామన్నపల్లె గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 30మంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరూ శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, కాచి చల్లార్చిన మంచినీటిని తాగాలని గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, ఏఎన్ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

చిగురుమామిడి,సెప్టంబరు 3: అర్హులైన రైతులందరికీ పంట రుణమాఫీ వస్తుందని మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి అఖిల అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మనపల్లిలోని రైతు వేదికలో రుణమాఫీ కాని రైతులకు సంబంధించిన కుటంబ సభ్యుల వివరాలు తీసుకున్నారు. రేషన్ కార్డు లేని రైతుల కూడా రుణమాఫీ వర్తిస్తుందన్నారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్య సమస్యలు దూరం

శంకరపట్నం, సెప్టెంబరు 3: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని యూనిసెఫ్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కిషన్‌స్వామి అన్నారు. మంగళవారం స్వచ్ఛత పక్వాడలో భాగంగా ఎస్‌బీఎం బృందం శంకరపట్నం మండలంలోని కేశవపట్నం జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులను పరిశీలించారు. మూత్రశాలకు నీటి కనెక్షన్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. పాఠశాల ఆవరణలో భూగర్భ జల సంరక్షణ కోసం రెండు ఇంకుడు గుంతలను మార్కింగ్ చేశారు. బాలికలు ఋతుస్రావ సమయంలో వాడిన పాడ్స్‌ను కాల్చడానికి ఇన్సినేరేటర్ అనే ఎలక్ట్రిక్ యంత్రాన్ని అమర్చారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ఆహారం తీసుకునేటప్పుడు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఋతుస్రావ సమయంలో బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మంచి ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. ఎంపీడీవో కృష్ణప్రసాద్ విద్యార్థులకు భోజన సమయంలో చేతుల శుభ్రం చేసుకోవడానికి సబ్బులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఎం జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్, ఏపీవో శారద, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



చెంజర్లలో పోషణ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



ఫకీర్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో..

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 3: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ అధికారులు అన్నారు. కరీంనగర్ మండలంలోని ఫకీర్‌పేట, చెర్లబూత్కూర్ గ్రామాలలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శులు శ్రీదేవి, బి.దేవిక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు రాధ, ఆశా కార్యకర్త రాజమణి, అంగన్‌వాడీ టీచర్ నీల, పద్మ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

●**మానకొండూర్:** మండలంలోని చెంజర్ల గ్రామంలో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు బరువులు, ఎత్తులు తీసి, బరువు తక్కువ పిల్లలను గుర్తించి ఆకలి పరీక్ష నిర్వహించారు. అనంతరం రీడ్ ఎ తన్ కార్యక్రమంలో బాగంగా తల్లుల చేత కథలు చదివించి, రాయించడం చేపట్టి, పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అంగన్ వాడి సూపర్‌వైజర్, ఎం. అరుణ, కార్యదర్శి అంజయ్య, సరోజన, పద్మ, ఆశ కార్యకర్తలు మంజుల, కనుకతార, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

●**చొప్పదండి:** పట్టణంలోని రాంనగర్ అంగన్వాడి కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పిల్లల తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సెప్టెంబరులో జరిగే పోషణ మాసంలో భాగంగా రీడ్ ఏ థాన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 3నుంచి 6సంవత్సరాల పిల్లలకు సంబంధించిన ప్రీస్కూల్ కథలపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ కోమల పాల్గొన్నారు.

●**తిమ్మాపూర్:** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌లో అంగన్‌వాడి కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ సల్ల శారద ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సెప్టెంబరు మాసం పోషణ మాసం కావున ప్రతి సెంటర్‌లో పోషణకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 0-5 సంవత్సరాల పిల్లల బరువు తప్పకుండా తీయాలి, తల్లులు, కిషోర బాలికలు మంచి పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో శ్రీమతి, సూపర్‌వైజర్లు శ్రీలత, డాక్టర్ ప్రణీత, ఏఎన్ఎంలు రోజా, శ్రీవాణి, అంగన్‌వాడీ టీచర్లు జమున, కవిత, అన్నపూర్ణ, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు3: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ)రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి నీళ్ళు ఇళ్ళల్లోకి వచ్చి చాలా ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. నిత్యవసర వస్తువులు కూడా పూర్తిగా తడిసిపోయాయని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'ప్రజల ఇబ్బందులు పట్టని ఎమ్మెల్యే'

భగత్‌నగర్, సెప్టెంబరు3: నగరంలో వరదలు, విషజ్వరాలు ప్రబలుతుంటే ప్రజలు ఇబ్బందులు పట్టకుండా ఎమ్మెల్యే మేయర్‌లు ఉన్నారని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు అన్నారు.

ఎన్నికల సమయంలో ఓట్లకోసం ఇంటింటా తిరిగి ఎన్నికయ్యాక ఆపద సమయంలో పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే, మేయర్ వెంటనే క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిష్కరించాలని లేని పక్షంలో రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు.

'సీఎం సహాయనిధికి ఒక రోజు వేతనం ఇవ్వడం హర్షణీయం'

సుభాష్‌నగర్, సెప్టెంబరు 3: ముఖ్యమంత్రి సహాయ నిధికి ఉద్యోగులు ఒక రోజు మూల వేతనం ఇవ్వడం పట్ల ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాల కారణంగా జన జీవనం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. చాలా ప్రాంతాల్లో తీవ్ర ఆస్తి నష్టం, పంట నష్టం జరగడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని గమనించి తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ ఆక్షన్ కమిటి చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గతంలో కూడా ఉద్యోగులు ముందుండి సహాయాన్ని అందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సమావేశంలో టీఎన్‌జీవో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, టీజీవో నాయకుడు మడిపెల్లి కాళీచరణ్, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మిందర్‌సింగ్, మారుపాక రాజేశ్‌భరద్వాజ్, మహిళ జేఏసీ చైర్మెన్ ఇరుమల్ల శారద, రమేశ్, రవీందర్‌రెడ్డి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు చేయండి

-డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 3: వినాయక చవితి నుండి తొమ్మిది రోజుల పాటు అత్యంత ఘనంగా జరుపుకునే గణేశ్ నవరాత్రో త్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈనెల 7నుంచి ప్రారంభమయ్యే గణేశ్ నవరాత్రోత్సవాలకు, ఆ తర్వాత జరిగే నిమజ్జనోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో వినా యక మండపాలకు భారీ విగ్రహాలను తరలించేందుకు, నిమజ్జనో త్సవాలకు తీసుకెళ్ళే మార్గాల్లో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని, అవసరమైన మండపాల వద్ద డస్ట్ పోసి నీరు నిలువకుండా చూడాలని అన్నారు. అలాగే వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున వినాయక మండపాల చుట్టూ ఎలాంటి పిచ్చిమొక్కలు లేకుండా, పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చేయాలని, వర్షపు నీరు ఉంటే మళ్ళించాలని సూచించారు. వినాయక మండ పాల వద్ద లైటింగ్, మంచినీటి వసతి వంటి సౌకర్యాలకు ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని, ఇది నగరపాలక సంస్థ బాధ్యత అని, ఇందుకోసం ఇంజనీరింగ్, సాని టేషన్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కమిషనర్‌ను కోరారు.

పెరుగుతున్న 'గృహజ్యోతి' లబ్ధిదారులు

-ప్రజా పాలన కేంద్రాల్లో సవరణలతో విద్యుత్ వినియోగదారులకు ప్రయోజనం



కరీంనగర్ రూరల్,సెప్టెంబరు3: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కోసం అర్హుల నుంచి మళ్లీ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. గృహ జ్యోతి పథకంలో నెలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రయోజనాన్ని లబ్ధిదారులు పొందుతున్నారు. ఈ పథకంలో అర్హులైన వారందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో మరోసారి అవకాశం కల్పించారు. కరీంనగర్ డివిజన్ పరిధిలో గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కరీంనగర్ రూరల్ మండలం డివిజన్ పరిధిలో మొత్తం 56,200 గృహ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య మార్చిలో 18,445 మంది ఉండగా, ఏప్రిల్‌లో18,445 లబ్ధిదారులు, మేలో 16,227మంది, జూన్‌లో 16,127 మంది, జూలైలో 18,138 మంది, ఆగస్టు నెల వచ్చే సరికి పెరిగి 19,221 మందికి చేరింది. అయితే మళ్ళీ ప్రభుత్వం సవరణలకు అవకాశం ఇవ్వడంతో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటున్నారు. గతంలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు కొంత మందికి నాట్ అప్లైడ్ అని వచ్చింది. దీంతో మళ్ళీ ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవడంతో జీరో బిల్లులు వస్తున్నాయి. దీంతో ఆయా లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 3: నగరంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. వరలక్ష్మి నగర్, వెంకటసాయి, సీతారాంపూర్‌లో భాగం, సాయిరామ్ నగర్, రోడ్‌నెంబర్-2, రెడ్డి ఫంక్షన్‌హాల్ వెనుక వైపు, భరత్ టాకీస్ ప్రాంతం, సాయి నిర్మాణ భవనం ఏరియా, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



నాగిరెడ్డిపూర్ కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, సెప్టెంబరు 3: వరదలతో కోతకు గురై రవాణాకు ఇబ్బంది పడుతున్న రోడ్లను యుద్ధప్రాతిపాదికన మరమ్మతు చేయించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులను ఆదేశించారు. వరదతో కోతలకు గురైన మండలంలోని నాగిరెడ్డిపూర్,లక్ష్మీదేవిపల్లిల బ్రిడ్జిలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నాగిరెడ్డిపూర్ బ్రిడ్జి ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కోత పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భారీ వర్షాలతో వరదలకు దెబ్బతిన్న రోడ్లు, దారులుకు మట్టి పోయించి మరమ్మతులు చేయించి రవాణా పునరుద్ధరించాలన్నారు. ఆర్‌అండ్‌బి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నాగిరెడ్డిపూర్ బ్రిడ్జికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తాత్కాలికంగా మట్టి పోయించి దారిని పునరుద్ధరించాలన్నారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి బ్రిడ్జిని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన బ్రిడ్జికి గత పాలకులు శంకుస్థాపనలు చేసి పనులు మరిచారని వీలైనంత తొందరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఎంసీ డైరెక్టర్ ముచ్చె శంకర్, మాజీ సర్పంచ్ ఆకుల ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

● రామడుగు : మండలంలోని గుండి గ్రామంలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జీని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. మంగళవారం గ్రామంలో నూతన బ్రిడ్జీకి ఇరువైపులా భూమిని కోల్పోయిన నిర్వాసితులకు భూ పరిహారం కోసం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమక్షంలో వారం లోపు నష్టపరిహారం ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో పనలు వేగంగా జరుగుతున్నాయి. గుండిలో శిథిలావస్థలో ఉన్న లోలెవెల్ బ్రిడ్జిని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మహిళ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, జిల్లా బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్, మండలాధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, సీనియర్ నాయకులు పంజాల శ్రీనివాస్‌గౌడ్, అమిరిశెట్టి సుధాకర్ పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

రామడుగు, సెప్టెంబర్ 3 : మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త జిట్టవేణి ఆంజనేయులు గత ఆరు నెలల క్రితం తన కాలును వైద్యులు తొలగించారు. మండల కేంద్రంలో ఇటీవల పర్యటన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు తనకు ట్రై సైకిల్ మంజూరు చేయాలని విన్నవించుకున్నారు. ఈ మేరకు ట్రై సైకిల్‌ను మంజూరు చేయగా బీజేపీ మండల శాఖాధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, నాయకులు మంగళవారం ఆంజనేయులకు అందజేశారు.

మైలారంలో చెరువు కట్ట తొలగింపును అడ్డుకున్న అధికారులు

గన్నేరువరం, సెప్టెంబర్ 3: మండలంలోని మైలారం గ్రామ రహదారి వెంట ఉన్న చాకలి కుంట చెరువు కట్టను దారి ఇరుకుగా ఉందన్న కారణంతో కొంతమంది స్థానిక రైతులు మంగళవారం జేసీబీతో తొలగించేందుకు యత్నించగా సమాచారం అందుకున్న ఇరిగేషన్ ఏఈ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని కట్ట తొలగిస్తున్న రైతులను అడ్డుకున్నారు. వెంటనే చెరువు కట్టను పునరుద్ధరించాలని లేని పక్షాన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు చెరువు కట్టను యథావిధిగా మరమ్మతు చేస్తామనడంతో సమస్య సద్దుమణిగింది. ఈ సందర్భంగా ఏఈ రాజ్‌కుమార్ మాట్లాడుతూ చెరువులలో ఎలాంటి తవ్వకాలు, నిర్మాణాలు, చేపట్టడం, మట్టిని నింపడం లాంటివి చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వరదకాలువ నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి



జమ్మికుంటలో వరద కాల్వను పరిశీలిస్తున్న వొడితల ప్రణవ్‌బాబు

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 3: జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వరదకాల్వ నిర్మాణం కోసం నిధుల మంజూరుకు కృషి చేస్తానని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో వరద బాధితులను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, కౌన్సిలర్లతో కలిసి పరామర్శించారు. వరద బాధితులు తమ సమస్యలను వివరించారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బాధితులందరికీ అండగా నిలుస్తానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ప్రణవ్‌బాబు మాట్లాడుతూ ఇళ్లలోకి వరద నీరు చేరకుండా శాశ్వత పరిష్కారం చేపడుతామని, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధిత కుటుంబాలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించిన ప్రణవ్

వీణవంక: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మామిడాలపల్లి గ్రామ చివరులో గొల్లపల్లి వద్ద కరీంనగర్ రహదారి వరద నీరుతో కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ రహదారులను పరిశీలించారు. వీణవంక నర్సింగాపూర్ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణంలో ఉండగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు పూర్తిగా కొట్టుకుపోగా దానిని పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను కోరారు. అనంతరం వల్భాపూర్, బేతిగల్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు గంగాడి రాజిరెడ్డి ఎక్కటి రఘుపాల్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్,శ్రీపతిరెడ్డి, మందా అనిల్‌రెడ్డి, శీలం సురేందర్‌రెడ్డి,తిరుపతిరెడ్డి,సునిల్, సాహెబ్ హుస్సేన్ పాల్గొన్నారు

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 3: నగరంలోని 10వ డివిజన్ ప్రతిమానగర్ ఆడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్‌ప్రీతి, కార్పొరేటర్ నక్కసద్మ కృష్ణలు కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు, మహిళలు కుట్టు శిక్షణ నేర్చుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలని సూచించారు. సిస్టర్ హిత మాట్లాడుతూ ఏ పనిచినైనా సంపూర్ణం చేయాలి అంటే పట్టుదల ఎంత అవసరం అని, ప్రయత్నంతో ప్రతిది సుసాధ్యమని తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సిస్టర్ దీప్తి సంస్థ ప్రతినిధులు మర్రి, మల్లేశం, శ్రీనివాసరెడ్డి, రమేష్, రూప, స్రవంతి, మౌనిక, సీఏ బేగం, ఆర్‌పి, మాధవి పాల్గొన్నారు.

జర్నలిస్టు చికిత్సకు ఆర్థిక సాయం

కరీంనగర్ స్పోర్ట్స్/భగత్‌నగర్, సెప్టెంబరు3: స్పోర్ట్స్ జర్నలిస్టు మహేందర్ వైద్య ఖర్చులకు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి యాభైవేల ఆర్థిక చేయూతనందించారు. మంగళవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేష్‌రెడ్డితో కలిసి మాట్లాడుతూ అందరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. విష జ్వరంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మహేందర్ కుటుంబానికి అండగా ఉండాలన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

భగత్‌నగర్, సెప్టెంబరు3: చింతకుంట గ్రామంలోని శాంతినగర్‌లో నఫీజ్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును తాజా మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సహకారంతో మంజూరైన చెక్కును ఆయన ఆదేశాల మేరకు పంపిణీ చేశామన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

కరీంనగర్‌రూరల్, సెప్టెంబరు3: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో భారీ వర్షానికి నష్టపోయిన మర్రి సత్తవ్వకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, సెక్రెటరీ ఊట్కూరి రాధకృష్ణరెడ్డి, ఇన్‌చార్జి ట్రెసరర్ ఎలగందుల మునీందర్ పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 3: మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఉమాపుత్ర ఉత్సవ కమిటీ చైర్మన్ కోట సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం విద్యానగర్‌లో ఉమాపుత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లోగోను, ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్ర మంలో కార్పొరేటర్ బండ సుమ రమణారెడ్డి, సభ్యులు రవికుమార్, రాజు, వెంకన్న, సందీప్, సదానందం, రాములు, శ్రీనివాసరావు, సాయి, ఆనందరావు పాల్గొన్నారు.

వరద తాకిడి పంట నష్టం

చిగురుమామిడి,సెప్టంబరు 3: వర్షాలతో మండలంలోని అనేక గ్రామాల్లో వరి పొలాలకు నష్టం జరిగింది. దాదాపు 100 ఎకారాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నాయి. అదే తరహాలో పత్తి పంటకు నష్టం జరిగింది. అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. చిన్నముల్కనూర్‌లో 30 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని గ్రామ రైతులు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల నిరసన

హుజూరాబాద్, సెప్టెంబరు 3: హుజూరాబాద్ పట్టణంలోని విద్యుత్ శాఖ టౌన్ కార్యాలయం ఎదుట ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు మంగళవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు బదులుగా మెరిట్ కమ్ సినియార్టీని విద్యుత్ శాఖలో అవలంభిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కుమారస్వామి, యాదగిరి, నర్సయ్య, శ్రీనివాస్, శ్రీరాం,శ్రీధర్, సంపత్, కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శివ చాలీసా పారాయణం

చొప్పదండి, సెప్టెంబర్ 3: శ్రావణమాస అమావాస్య సందర్భంగా చొప్పదండిలోని శ్రీశివకేశవ (శంభుస్వామి) ఆలయంలో సాయి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం శివచాలీసా, లలిత సహస్ర నామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు జనగామ సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

కురుమ సంఘం ఎన్నికలు

గంగాధర, సెప్టెంబరు3: మండలంలోని లింగంపల్లి కురమ సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించుకున్నారు. అధ్యక్షుడిగా ఏనుగుల లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా పుల్ల బక్కయ్య, ఉపాధ్యక్షుడిగా కచ్చు భరత్, కార్యదర్శిగా కడారి కొమురయ్య, ప్రచార కార్యదర్శిగా గుంటి నర్సయ్యలను ఎన్నుకున్నారు.

'రైల్వే అధికారుల చర్యలతో ఎక్స్‌ప్రెస్ రద్దు'

జమ్మికుంట, సెప్టెంబర్ 3: జమ్మికుంట రైల్వే స్టేషన్లో అధికారుల అసమర్థత వల్లే దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ రద్దు అయిందని బీజేపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు. దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు అర్ధరాత్రి జమ్మికుంటకు చేరుకుంటాయని, ఆ సమయంలో ఉద్యోగుల ఉండటం లేదని, దీంతో టికెట్ కౌంటర్ బంద్ పెట్టి, టికెట్లు ఇవ్వకపోవడం వల్ల రైళ్ల రద్దుకు కారణం అయ్యారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కళాశాలను సందర్శించిన తహసీల్దార్

జమ్మికుంట, సెప్టెంబర్ 3: జమ్మికుంట పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలను కరీంనగర్ ఎమ్ఎల్ఎస్ పాయింట్ గోదామ్ ఇంచార్జి మూర్తితో కలిసి తహశీల్దార్ రమేష్ బాబు మంగళవారం సందర్శించారు. కళాశాలకు వచ్చే బియ్యం నాణ్యతగా ఉండటం లేదని ప్రిన్సిపాల్ స్వయంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు బియ్యం నాణ్యతను పరిశీలించారు.

గణేష్ మండప నిర్వాహకులు అనుమతి తీసుకోవాలి

చొప్పదండి, సెప్టెంబర్ 3: గణేష్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుస్టేషన్ నుంచి అనుమతి తీసుకోవాలని ఎస్ఐ అనూష ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు మండలంలోని ప్రతి గ్రామంలోని నిర్వాహకులు అనుమతి పొందాలని ఆమె తెలిపారు.

ఎస్ఐ అనూషను హనుమాన్ భజన మండలి భక్తులు సన్మానించారు. కార్యక్రమంలో పిట్టల రఘుమోహన్, చీకట్ల లచ్చయ్య, దండే రాజయ్య, దండే కొమురయ్య, పూదరి నారాయణ, పూదరి లక్ష్మయ్య పూదరి రాములు, రాజు పాల్గొన్నారు.